క్లుప్తంగా

క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రీడాకారులకు షూ అందజేస్తున్న పాల శ్రీనివాసరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: ఫుట్‌బాల్ క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని స్థానిక రోటరీక్లబ్ సభ్యులు కేఆర్ శ్రీనాథ్‌రెడ్డి, సుధాకర్‌రావు, మచాని నాగరాజు, కేఆర్ నట్‌రాజ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పట్టణలోని ఫుట్‌బాల్ క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలశ్రీనివాస రెడ్డి సహకారంలో ఫుట్‌బాల్ షూలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు కేఆర్ నరసింహారెడ్డి, కురువ బీరప్ప, షఫీవుల్లా, మల్లారి సోమశేఖర్, క్రీడాకారుల సంఘ నాయకులు షేక్షావలి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న యల్లప్ప, నాయకులు

పెద్దకడబూరు: ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని చిన్నతుంబళం ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం డివిజన్ అధ్యక్షుడు యల్లప్ప ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఎంపీటీసీ లక్ష్మన్న, సోమప్ప, బ్రహ్మయ్య, లింగన్న గౌడ, బుడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి శత జయంతి రథయాత్ర



పట్టణంలో సత్యసాయి శత జయంతి యాత్ర

ఎమ్మిగనూరుటౌన్: ఈ ఏడాది నవంబర్‌లో జరుగనున్న శ్రీ సత్యసాయి శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న రథయాత్ర బుధవారం పట్టణానికి చేరుకుంది. సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రవేశించిన శత జయంతి రథ యాత్రకు సంస్థ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కన్వీనర్ అశోక్, సేవాదల్ ప్రతినిధులు సూర్యనారాయణ రెడ్డి, పట్టాభిరామ్, ప్రముఖ వైద్యులు గౌడప్పగౌడ్, నవీక్‌కుమార్ గౌడ్ దంపతులు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. రథ యాత్ర శివసర్కిల్, సోమప్ప సర్కిల్ మీదుగా ఎంజీ పెట్రోల్ బంక్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకుడు సత్యనారాయణ రెడ్డితో పాటు స్థానిక మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా ప్రిన్సిపాల్‌పై విచారణ



ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ శాంతి మాట తీరు సరిగా లేదంటూ ఫిర్యాదులు రావడంతో ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాసులు బుధవారం విచారణ చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని కొంతమంది జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో జిల్లా విద్యాధికారి శామ్యూల్ పాల్ విచారణ చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు విద్యార్థినుల తల్లిదండ్రులను పిలిపించి విచారించామన్నారు. నివేదికను తయారు చేసి అధికారులకు అందిస్తామన్నారు.

కేరళ మాజీ సీఎంకు నివాళి



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రపటానికి స్థానిక పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు గోవిందు, రాముడు మాట్లాడుతూ 80 సంవత్సరాల పాటు ప్రజాసేవ చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీనర్సయ్య, కృష్ణ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ టౌన్‌షిప్‌పై నీలినీడలు!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మధ్యతరగతి ప్రజల కోసం స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు
- బనవాసి వద్ద 161 మందికి ప్లాట్ల కేటాయింపు
- కూటమి ప్రభుత్వ వచ్చాక మిగతా ప్లాట్లకు నిలిచిన దరఖాస్తు ప్రక్రియ
- మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం



బనవాసివద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్‌టౌన్‌షిప్

ఎమ్మిగనూరురూరల్: పట్టణ మధ్య తరగతి వర్గాల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్మార్ట్‌టౌన్‌షిప్‌లకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లింపుదారులకు ఎంఐజీ లే అవుట్లను ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించే చర్యలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ బృహత్తర లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. ఎంఐజీ కాలనీకి ఎన్టీఆర్ టౌన్ స్మార్ట్ సిటీగా పేరు మార్చు చేసి వదిలేశారు. మిగిలిన ప్లాట్లకు దరఖాస్తుల స్వీకరణ నిలిపివేశారు. పైగా టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల కల్పనకు ఖరారైన టెండర్లకు మున్సిపల్ శాఖ క్లియరెన్స్‌లు ఇవ్వకపోవడంతో సౌకర్యాలపై సందిగ్ధత నెలకొంది.

ఎంఐజీ కాలనీలో 1,134 ప్లాట్లు

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న ఎంఐజీ కాలనీ 1,134 పాట్లు ఏర్పాటు చేశారు. అందులో 150 గజాలతో 447 ప్లాట్లు, 200గజాలతో 360 ప్లాట్లు, 240 గజాలతో 199 పాట్లు, ఇతర సైజ్ ప్లాట్లు 128 పాట్లుగా విభజించారు. రిజిస్ట్రేషన్ చార్జీలు మినహా సెంటు ధర రూ.2.78 లక్షలు నిర్ణయించారు.

సకల సదుపాయాల కల్పన

110.10 ఎకరాల్లో ఎంఐజీ కాలనీలో 1,134 ప్లాట్లు నివాసయోగ్యమైన ప్లాట్లుగా మధ్యతరగతి వారికి కేటాయిస్తారు. 11.01 ఎకరాల్లో పార్కులు, ప్లేగ్రౌండ్స్, విద్యా-వైద్య సదుపాయాల కల్పనకు కేటాయించారు. విశాలమైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు 37.85 ఎకరాలు వదిలారు. ప్రభుత్వ కార్యకలాపాలకు 5.59 ఎకరాలు కేటాయించారు. రోడ్లు-డ్రైనేజీ వ్యవస్థతోపాటు తాగునీటి కుళాయిలు, విద్యుత్ సౌకర్యం, కమ్యూనికేషన్ కనెక్టివిటి వంటి సకలవసతులు కాలనీలో కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు. ఎంఐజీ కాలనీలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సైనికులకు 25 శాతం వరకు ప్లాట్లు కేటాయిస్తారు. వ్యాపారులు, ఆదాయపన్ను చెల్లింపుదారులకు 70 శాతం ప్లాట్లు అందుబాటులో ఉంచారు. ప్రత్యేక కేటగిరీల కోసం 5 శాతం వాటా ఉంటుంది. ముఖ్యంగా ఎమ్మిగనూరు, ఆదోని పరిసర ప్రాంతాల్లో ఉద్యోగాలు నిర్వహించే వారికి ఎంఐజీ కాలనీ చాలా సౌకర్యవంతంగా ఉండే అవకాశం ఉంటుందని ఉద్యోగులు ముందుకొచ్చారు.

రూ.11కోట్ల విక్రయాలు

బనవాసి స్మార్ట్‌టౌన్‌షిప్‌లో 161 మందికి ప్లాట్లను కేటాయించారు. 79 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. దీని ద్వారా రూ.11కోట్లకు పైగా కుడాకు జమ అయ్యాయి. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్, ప్రభుత్వ పాలనల్లో మార్పు రావడంతో దరఖాస్తుల ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. అధికారంలోకి వచ్చిన కూటమి పెద్దలు స్మార్ట్‌టౌన్‌షిప్‌లపై ఆసక్తి చూపడంలేదు. స్మార్ట్‌టౌన్‌లో రోడ్లు, డ్రైనేజీ, డివైడర్లు ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, ఉద్యానవనాల పెంపుకు రూ.58 కోట్లతో మౌలిక వసతుల కోసం గతంలో టెండర్లు పిలిచారు. రెండు కంపెనీలు ఈ టెండర్లల్లో పాల్గొన్నా మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ నుంచి ఇంకా క్లియరెన్స్‌లు ఇవ్వలేదు.

110.10 ఎకరాల్లో స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు

ఎమ్మిగనూరు, ఆదోని నియోజక వర్గాలవారికి ఎమ్మిగనూరు(బనవాసి) ఎమ్మిగనూరు-ఆదోని ప్రధాన రహదారి(ఎన్‌హెచ్-167) పక్కనే, జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో గత ప్రభుత్వం అన్ని క్లియరెన్స్‌లు ఇచ్చి స్మార్ట్ టౌన్‌షిప్‌కు దరఖాస్తులు స్వీకరించింది. ఎమ్మిగనూరు పట్టణానికి ఆరు కిలోమీటర్ల సమీపంలో బనవాసి అటవీ భూములు ఉన్నాయి. పశు సంవర్ధకశాఖకు చెందిన రెండువేల ఎకరాల్లో 110.10 ఎకరాల్లో ఎంఐజీ కాలనీ నిర్మిస్తే ఉద్యోగులకు, మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని అప్పటి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఎకరం భూమిధర రూ.36 లక్షలు చొప్పున పశుసంవర్ధకశాఖకు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగం జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో ఆదోని-ఎమ్మిగనూరు ప్రధాన రహదారి పక్కనే సర్వేనెంబర్లు 313, 314, 324, 325, 326, 342లోగల 110.10 ఎకరాలను ఎంఐజీ కాలనీ కోసం పశుసంవర్ధకశాఖ నుంచి సేకరించారు. దీనికి కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) లే అవుట్ (ఎల్‌పీ నెం.19/2022/ఎంఐజీ/ఏ) అప్రూవల్ ఇచ్చింది. దీంతో మధ్యతరగతి వర్గాలకు పచ్చదనపు ఆహ్లాదం..హైవే సదుపాయలతో అందమైన కాలనీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

మౌలిక వసతులు కల్పించాలి



ఉద్యోగులు, మధ్య తరగతి వర్గాల వారి కోసం ఎంఐజీ కాలనీ ఏర్పాటు చేయటం వల్ల ఉద్యోగుల్లో స్వగృహకల సాకారం కానుంది. అప్పట్లో స్మార్ట్ టౌన్‌లపై దుష్ప్రచారం చేయడంతో చాలామంది ముందుకు రాలేదు. జిల్లా ఉన్నతాధికారులు అవెర్నెస్ క్యాంపులు ఏర్పాటు చేయటం, ముందుగా కాలనీ లే అవుట్‌లో మౌలిక వసతులు కల్పించటం మొదలు కావాలి. అందరికి అందుబాటులో ఉండేలా ధరలు ఉండాలి.

– బజారి, ఆదోని తాలూకా సెక్రటరి, ఏపీ ఎన్జీవో సంఘం

ప్రభుత్వం చొరవ చూపాలి

మధ్య తరగతి వర్గాల వారి కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో బనవాసి వద్ద స్మార్ట్‌టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశారు. అయితే స్మార్ట్‌టౌన్‌షిప్‌పై అప్పట్లో కొన్ని వర్గాలవారు చేసిన చెడు ప్రచారాలతో ఉద్యోగులు, వ్యాపారులు అయోమయంలో పడి దరఖాస్తులు చేసుకోలేదు. మౌలిక వసతుల కల్పనకు రూ.58కోట్లతో ఖరారైన టెండర్లకు ప్రభుత్వం క్లియరెన్స్‌లు ఇచ్చి పనులు మొదలయ్యేలా చూడాలి. దరఖాస్తు ప్రక్రియను చేపట్టాలి.

– బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్

ఫొటో విధానాన్ని ఉపసంహరించుకోవాలి

ఆదోని రూరల్: ఉపాధిహామీ చట్టంలో రెండు పూటలా ఫొటో అప్‌లోడ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగంగా ఈ విధానాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ నిబంధనల అమలులోకి వస్తే ఉపాధిహామీ కూలీలు పనులకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సమావేశంలో సీఐటీయూ మండలాధ్యక్షులు జె.రామాంజనేయులు, రైతు సంఘం మండలాధ్యక్షుడు శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పాండురంగ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యాలయాలు ప్రారంభించాలి



సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని సెంట్రల్: ముస్లిం మైనార్టీలకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో నిర్మాణం చేపట్టిన మైనార్టీ గురుకుల విద్యాలయం, ఐటీఐ కళాశాలను తక్షణమే ప్రారంభించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజా కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆదోని మండలంలోని ఆరెకల్లు గ్రామంలో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు నేడు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఆ విద్యాలయాలపై కనీసం స్థానిక నాయకులు గాని, అధికారులు గాని స్పందించక పోవడం సిగ్గుచేటని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఏవీఎఫ్ నాయకులు రమణ, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



నాగలదిన్నెలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల అధికారులు

నందవరం : వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ పుల్లయ్య లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో పెండింగ్‌లో ఉన్న గృహాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామంలో 108 గృహాలు మంజూరయ్యాయని, అందులో 5 మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. థర్డ్ పార్టీకి చెందిన గృహాలకు లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులు రూ.27 వేలు చెల్లించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జింకల నుంచి పంటలను కాపాడాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సాగు చేసిన పంటలపై జింకల బెడదను నివారించి రైతులను కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. అరకొరగా కురిసిన వర్షాలతో రైతులు పంటల సాగుకు విత్తనాలు వేసుకున్నారన్నారు. అయితే మొలకెత్తిన విత్తును జింకలు తిని నాశనం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు జింకల పార్క్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమైయ్యారని ఆరోపించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, మల్లయ్య, నాయకులు కోటకొండ సూరి, కృష్ణ, హొలగుంద వెంకటేశర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలపై పరిశీలన



సూపరింటెండెంట్ డాక్టర్ సుధాతో మాట్లాడుతున్న డాక్టర్ విజయకుమార్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చిన్న పిల్లల వైద్య సేవల స్థాయి పెంపుపై రాష్ట్ర వైద్యశాఖ కమిషన్ కార్యాలయం నుంచి డాక్టర్ విజయకుమార్ బుధవారం ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. గదులు, ప్రస్తుతం ఉన్న వసతుల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాను అడిగి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ సుధా మాట్లాడుతూ చిన్న ప్లిలల వైద్య సేవల స్థాయిని పెంచేందకు కావలసిన నర్సింగ్ స్టాఫ్, ఇతర వసతులు కల్పించాలని వైద్యశాఖ అధికారులకు చాలా సార్లు నివేదికలు పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం పాత హాస్పిటల్‌లో చిన్న పిల్లలకు వైద్య సేవలు అందిస్తున్నామని, ఇప్పుడు కొత్తగా ఏర్పాటైన వంద పడకల ఆసుపత్రిలోకి మార్చాలని డాక్టర్ విజయకుమార్‌ను కోరామన్నారు. అలాగే సిబ్బంది, వైద్య పరికాల గురించి చెప్పినట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: ఓపెన్ స్కూల్(ఏపీఓఎస్ఎస్) ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియెట్ చదువుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కో ఆర్డినేటర్లు మల్లికార్జున, ప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. చదువుకోవాలని ఆశ ఉండి ఆర్థికపరమైన ఇబ్బందులు తదితర సమస్యలతో చదువును మధ్యలోనే ఆపేసిన వారికి ఇది మంచి అవకాశమన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పదవ తరగతిలో చేరదలిచిన వారు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏ పాఠశాలలో నైనా చదివి ఉండాలన్నారు. టీసీ లేక పోతే కనీసం డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. అభ్యర్థి ఆగస్టు 31వ తేదీకి 14 ఏళ్లు నిండి ఉండాలని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో చేరడానికి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. మార్క్స్ మెమో, టీసీ ఉండాలని, 2025 ఆగస్టు 31వ తేదీకి 15 సంవత్సరాలు నిండి ఉండాలని తెలిపారు. ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో ఈ నెల జూలై 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అపరాధ రుసుముతో రూ. 200లతో ఆగస్టు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బైక్ అదుపు తప్పి.. వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన మణిరత్నం

ఆలూరు రూరల్: బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణ సమీపంలోని కర్నూలు-ఆదోని వై జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. బళ్లారి జిల్లా కారెకల్లు గ్రామానికి చెందిన మణిరత్నం ఆదోని నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఆలూరు సమీపంలోని వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం రహదారిపై ఉంచిన డ్రమ్ములను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రయాణికులు గమనించి 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

మహిళలను మోసం చేసిన చంద్రబాబు

- అధికారం లోకి వచ్చి ఏడాదైనా అమలు చేయని 'అడబిడ్డ నిధి'
- అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలన్న మంత్రి వ్యాఖలు హాస్యాస్పదం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు 18 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ.1500ల ప్రకారం ఏడాదికి రూ.18వేలు ఇస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు అధికారం చేపట్టి ఏడాదైనా ఆ పథకాన్ని అమలు చేయక మహిళలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆడబిడ్డ నిధి పేరిట ప్రతి ఇంటికి బాండ్లు ఇచ్చి ఏడాది పాలన పూర్తయినా మహిళలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీని అమలు చేయలేక కూటమి ప్రభుత్వం నేడు మొసలి కన్నీరు కార్చుతుందని ఎద్దేవ చేశారు. స్వయాన రాష్ట్ర మంత్రి అచ్చెంనాయుడు ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌నే అమ్మాలని చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. పథకాలు అమలు చేయలేని వారు మ హామీలెందుకు ఇవ్వాలని ప్రశ్నించారు.

మహిళకు రూ.32,400కోట్లు బకాయి

అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయనందున గడిచిన ఏడాదికి సంబంధించి మహిళలకు అడబిడ్డ నిధి కింద రూ.32,400కోట్లు కూటమి ప్రభుత్వం బకాయి పడిందని బుట్టా రేణుక అన్నారు. బకాయిలను ఎగ్గొట్టే పథకమిదని, అక్కా చెల్లమ్మలకు ఇచ్చిన హామీని హరించడమే కాకుండా వారికి వెన్నుపోటు పొడినట్లు అయ్యిందన్నారు. గత ఏడాది 13 నెలల్లో మొత్తం రూ.35,100కోట్ల మేర అడబిడ్డ నిధిని మహిళలు కోల్పోయారన్నారు. చంద్రబాబు, లోకేష్‌లతో సహా టీడీపీ నాయకులు ఎన్నికల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఈ పథకాన్ని గ్యారెంటీగా అమలు చేస్తామని చెప్పి మోసంచేసి ఓట్లు వేయించుకున్నారన్నారు. ఇచ్చిన ఏ హామీని సక్రమంగా అమలు చేయని కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజల్లో ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు.

హామీలన్నీ అమలు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్..

2019 అసెంబ్లీ ఎన్నికల ముందు మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను క్యాలెండర్ ప్రకటించి ఆ మేరకు పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని పార్టీ ఇన్‌చార్జ్ గుర్తు చేశారు. 78,94,169 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.25,570కోట్లు ఇచ్చారన్నారు. అదేవిధంగా వైఎస్సార్ చేయూత కింద 26,98,931 మంది మహిళలకు రూ.19,189కోట్లు వారి ఖాతాలకు డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా జమ చేశారన్నారు. అందుకే ఏడాది కూటమి ప్రభుత్వ పాలనపై విసుగొచ్చి ప్రజలు మళ్లీ వైఎస్ జగన్ పాలన కావాలని కోరుతున్నారన్నారు.

టిడ్కో గృహాలకు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నిర్మితమైన టిడ్కో జీప్లస్ 3 గృహాలకు అర్హులైన వారు దరఖాస్తులను ఏడు రోజుల్లోగా సంబంధిత వార్డు సచివాలయాల్లో అందజేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి బుధవారం తెలిపారు. అందరికీ ఇళ్లు పథకం కింద పట్టణంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాల్లో పలు కేటగిరీల్లో 131 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో కేటగిరి- 2 కింద ఒక్కొక్కటి 365 చదరపు అడుగులు కలిగిన గృహాలు 97 వున్నాయని, వాటికి అర్హులై ఉండి దరఖాస్తుల ద్వారా ఎంపిక కాబడిన వారు రూ.25వేలను రెండు వాయిదాల్లో చెల్లించాలన్నారు. మిగిలిన రూ.3.15లక్షలకు బ్యాంక్ రుణం వుంటుందన్నారు. అదేవిధంగా కేటగిరి 3 కింద 430 చదరపు అడుగులు కలిగిన గృహాలు 34 వున్నట్లు తెలిపారు. వీటికి ఎంపికై నా వారు రూ.50వేలు రెండు వాయిదాల్లో చెల్లించాలని, అదే విధంగా ఒక్కో ఇంటిపై రూ.3.65లక్షలు బ్యాంకు రుణం వుంటుందన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

ఆదోని రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చూస్తున్నాయన్నారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న, ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ కోరారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకె వెళ్లాలని బుధవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ సభ్యులు అయ్యన్న, శేఖన్న, శేషగిరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శామ్యుల్ పాల్

ఆదోని సెంట్రల్: పదో తరగతిలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి శామ్యూల్ పాల్ సూచించారు. పట్టణంలో కస్తూర్బా గాంధీ (జనరల్, మైనార్టీ) విద్యాలయాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని మెరుగుపరచాలన్నారు. వసతి సౌకర్యాలను కల్పించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. భోజనం ఎలా పెడుతున్నారు, రుచికరంగా ఉన్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాలను రుచి చూశారు.

26 నుంచి ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలు

గోనెగండ్ల: ఈనెల 26, 27 తేదీలలో ఎమ్మిగనూరులో జరిగే ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్, మాజీ జిల్లా నాయకుడు బాబు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలో మండల అధ్యక్షుడు పవన్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాల్లో విద్యార్థులు కూడా చురుగ్గా పాల్గొనాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా రియాజ్, పవన్ తేజలతో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గోనెగండ్ల: కర్నూలు నగరంలో జరిగే సీపీఐ జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం నాయకుడు మద్దిలేటి నాయుడు, తాలూకా అధ్యక్షుడు మాలిక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రం గోనెగండ్లలో సీపీఐ ఆధ్వర్యంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సీపీఐ పార్టీ 24వ మహాసభలు ఆగస్టు 9,10,11వ తేదీలలో కర్నూలు నగరంలో జరుగుతున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి శ్రీరాములు, శివరామాంజిని నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కోసిగి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆర్డీఎస్ కుడి కాల్వ, గుండ్రేవుల, వేదావతి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం ఆవరణలో సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హంగూ ఆర్భాటాలే తప్పా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాక సాగునీరు అందక పోవడంతో పనులు లేక ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. ఆగస్టు 9, 10, 11వ తేదీలలో సీపీఐ 24 వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెద్దకడబూరు సీపీఐ కార్యదర్శి వీరేష్, ప్రజా సంఘాల నాయకులు ఓంకార్ స్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, సంతోష్, రవి తదితరులు పాల్గొన్నారు.